## అధిక ధరకు సామగ్రి విక్రయిస్తున్నారని ఫిర్యాదు

మల్యాల, మే 10: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో సామగ్రి అధిక ధరకు విక్రయిస్తున్నారని హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు ఆలయ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఆలయ ప్రాంగణంలోని కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం దుకాణంలో లీటర్ వాటర్ బాటిల్ రూ. 30కి విక్రయించడంతో పాటు దుకాణాదారుడు దురుసుగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఆలయ అధికారులను వివరణ కోరగా ఆలయ పర్యవేక్షకుడు సునీల్ స్పందించారు. సదరు దుకాణ యజమానిపై చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు విషయాన్ని సైతం ఈవో శ్రీకాంతరావు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## మాజీ మంత్రి కొప్పుల పరామర్శ


మల్లేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, మే 10: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చుంచు మల్లేశ్ అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దవాఖానకు శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## రోడ్డు నిర్మాణానికి రైతుల అంగీకారం

పెగడపల్లి, మే 10: పెగడపల్లి మండలం కీచులాటపల్లి నుంచి ధర్మారం మండలం మల్లాపూర్ వరకు 24 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు రైతులు అంగీకరించినట్లు తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. గ్రామంలో శనివారం రైతులతో సమావేశమై రోడ్డు నిర్మాణంపై చర్చించినట్లు తెలిపారు. రెవెన్యూ నక్ష ప్రకారం పాత రోడ్డు 21 ఫీట్ల వెడల్పు ఉందని, అదనంగా మూడు ఫీట్లు పెంచి రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రతిపాదించారని తహసీల్దార్ వివరించారు. దీనిపై రైతులతో మాట్లాడి, రోడ్డు వెడల్పుపై వివరాలు వెల్లడించడంతో రోడ్డు నిర్మాణానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ తనూజా రాణి, మాజీ ప్రజాప్రతినిధులు స్వప్న–ఆనందం, రవీందర్ పాల్గొన్నారు.

## పీవీరావు జయంతి

పెగడపల్లి, మే 10: మండల కేంద్రంలో శనివారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు జయంతి వేడుకలను మండల మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, పీవీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేర్గు శ్రీనివాస్, మాల సంఘం రాష్ట్ర నాయకుడు బత్తుల ప్రదీప్, నాయకులు రాజయ్య, వెంకట్రాజం, సంజీవ్, మాణిక్యం పాల్గొన్నారు.

## తగ్గిన పసుపు ధర

మెట్‌పల్లి, మే 10: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పసుపు ధర పడిపోయింది. పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.10,216, కనిష్ఠంగా 9,999, గోళ క్వింటాల్‌కు గరిష్ఠంగా 9,595, కనిష్ఠంగా రూ. 9,595 పలుకగా, చూర రకం పసుపు మార్కెట్‌కు రాలేదు. ఈ రోజు పసుపు ఐదు క్వింటాళ్లు కొనుగోలు చేయగా, ఇప్పటి వరకు 50954 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

మెట్‌పల్లి టౌన్, మే 10: మెట్‌పల్లి పట్టణంలో అనాథ శవానికి మున్సిపల్ సిబ్బంది, పోలీసులు శనివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని సాయిరాం కాలనీలో రోడ్డు పక్కన రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి, ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి రెండు రోజులుగా ఎవరూ రాకపోవడంతో దవాఖాన అధికారులు మున్సిపల్, పోలీసు అధికారులకు తెలిపారు. దీంతో మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు పోలీసుల సమక్షంలో మున్సిపల్ కార్మికులు అనాథ మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ షకీల్‌బేగ్, మున్సిపల్ సిబ్బంది ముజీబ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మేడిపల్లి, మే 10: కొండాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ట్రైనీ ఎస్ఐ సుప్రియ శనివారం తెలిపారు. పసుపు పచ్చ పొడువు గీతల చొక్కా, మెడలో రుద్రాక్షమాలతో అస్తి పంజరంలా ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు కోరుట్ల సీఐ సెల్ నంబర్ 87126 56820, మేడిపల్లి ఎస్ఐ సెల్ నంబర్ 8712656792కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పోస్టర్ల ప్రదర్శన

జగిత్యాల, మే 10: వృద్ధుల సంరక్షణ చట్టంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కరపత్రాలను రూపొందించి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శిస్తున్నామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, కల్లూరు, కథలాపూర్, మేడిపల్లి, రాగోజీపేట్, పోరుమల్ల, తిప్పన్నపేట్, తిమ్మాపూర్, ఒడ్యాడ్, రంగాపూర్, వెంకట్‌రావుపేట, తదితర గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం పోస్టర్లను అతికించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ సిటీజన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్ముల ప్రకాశ్ రావు, పూసాల అశోక్ రావు, కౌన్సిలింగ్ ప్రతినిధులు పీసీ హన్మంత్ రెడ్డి, దిండిగాల విఠల్, ఎండీ యాకూబ్, కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల డివిజన్ల అధ్యక్షులు పబ్బా శివానందం, ఒజ్జల బుచ్చిరెడ్డి, రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సుంకె పరామర్శ

మల్యాల, మే 10: మల్యాలకు చెందిన గడ్డం లక్ష్మి, అల్లూరి శారద, పోతురాజు లక్ష్మి ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కొండపలుకుల రాంమోహన్‌రావు, జనగం శ్రీనివాస్, గడ్డం రాజేశ్వర్, బోడ గోవర్దన్, పోతురాజు శ్రీనివాస్, దశరథం, పోచంపల్లి రాజమల్లయ్య, శివ, అరుణ్‌కుమార్, రాకేశ్, తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మల్యాల, మే 10: మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు, బల్వంతాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వివరాలు, ఇప్పటి వరకు తూకం వేసిన ధాన్యం, ఇతర వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ నాయబ్ తహసీల్దార్ ఆనంద్, ఎఫ్ఐ బద్రి నరసింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, మే 10: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ఈవో శ్రీకాంతరావు భక్తుల రద్దీని గమనిస్తూ క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, కూరగాయల రాములు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

మేడిపల్లి, మే 10: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అలయన్స్ క్లబ్ జిల్లా సభ్యులు బండ్ల గజానందం, కటుకం సురేందర్ సూచించారు. దమ్మన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఏనుగు జాహ్నవి, ఏనుగు కౌశిక్, సరూర్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 466 మార్కులు సాధించిన అల్లె సహస్రను శనివారం అలయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయులు రాజు, శంకర్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, అలయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# జయహో భారత్

- ఇండియన్ ఆర్మీకి వెల్లువెత్తిన మద్దతు
- వివిధ వర్గాల ఆధ్వర్యంలో ర్యాలీలు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

జగిత్యాల/ పెగడపల్లి/ మేడిపల్లి/ రాయికల్ / కోరుట్ల రూరల్/ కథలాపూర్, మే 10: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఉగ్రవాదంపై పోరులో ఇండియన్ ఆర్మీకి మద్దతు వెల్లువెత్తింది. ఈ మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శనివారం చేపట్టిన ర్యాలీలు, ఆలయాల్లో పూజలతో దేశభక్తి వెల్లివిరిసింది. కాగా, జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల కోదండరామాలయంలో భారత సైన్యానికి భగవంతుడు శక్తిని ప్రసాదించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీ నిధులు రూ.10 లక్షలతో చేపడుతున్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక–ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, మాజీ జడ్పీటీసీ మహేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, నాయకులు తుమ్మ గంగాధర్, వెంకటేశ్వర్ రావు, చింత గంగాధర్, ఆదిరెడ్డి, ప్రతాప్, వేణు, హరీశ్,


జగిత్యాల: ధరూర్ క్యాంపులోని కోదండరామాలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

ప్రశాంత్ రావు, గాజుల శ్రీనివాస్, అనురాధ, శిరీష, ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాయికల్ మండలం కొత్తపేటలోని రాజరాజేశ్వర నాగాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో విక్రమ్ గౌడ్, అర్చకుడు చెరుకు రాజేశ్వర శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రాము యాదవ్, మాజీ సర్పంచ్ బత్తిని రాజేశం, మాజీ ఉప సర్పంచ్ కాటిపెల్లి రాజశేఖర్, రాజ్‌కుమార్, రంజిత్, అంజి పాల్గొన్నారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం రాజేశ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, నాయకులు విఠల రవీందర్‌రెడ్డి, ద్యాగ గంగాధర్, రాజిరెడ్డి, చిట్టిబాబు, నర్సయ్య, గంగాధర్, రమేశ్, శేఖర్, వెంకటేశ్, సతీశ్, బక్కన్న, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం దుంపేటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కాంగ్రెస్ మండల నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే, పెగడపల్లిలో భారత సైనికుల పోరాటానికి మద్దతుగా మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద సైనికులకు మద్దతుగా జాతీయ జెండాలు పట్టుకొని జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మల్లారెడ్డి, తిరుపతి, కిషన్, స్వామి, అనిల్‌గౌడ్, వంశీ, పవన్‌రెడ్డి, మధు, యువకులు పాల్గొన్నారు. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో జాతీయ జెండాలు పట్టుకొని, నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. వీరజవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.


పెగడపల్లి: మండల కేంద్రంలో సంఘీభావ ర్యాలీ తీస్తున్న నాయకులు, యువకులు


కోరుట్ల రూరల్: వెంకటాపూర్‌లోని వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

జగిత్యాల, మే 10: విద్యతోనే సమాజంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ స్పందన పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో బాలబాలికల కోసం మాధవ సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 1నుంచి 10వరకు గీతా విద్యాలయం ఆవరణలో నిర్వహించిన సంస్కార సాధన శిబిరం ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో ఉన్న గొప్పతనమే సంస్కారమన్నారు. నేటి విద్యావిధానంలో కేవలం ర్యాంకుల వెంటపడి పిల్లలకు సంస్కారం అందించడంలో విఫలం అవడంతో సమాజం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. మాధవ సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే విధంగా సంస్కార సాధన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. పది రోజుల పాటు విద్యార్థులు నేర్చుకున్న శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ డా ఆకుతోట శ్రీనివాసరెడ్డి, నగర సంఘ్ చాలక్ జిడిగె పురుషోత్తం, డాక్టర్ చింత రమేష్, అశోక్ రావు, మహిపాల్ రెడ్డి, చంద్రశేఖర్, శివకుమార్, సంతోష్, రమేశ్, రాజు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ స్పందన

## మాజీ ఎంపీటీసీకి పరామర్శ

కథలాపూర్, మే 10: కథలాపూర్ మండలం దుంపేట–పోసానిపేట గ్రామాల మాజీ ఎంపీటీసీ మల్యాల రమేశ్ అన్న శేఖర్ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. శేఖర్ మృతదేహం వద్ద మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు వర్దినేని నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, ఎండీ రఫీ, వేణుగోపాల్‌యాదవ్, గణేశ్, శ్రీనివాస్, ప్రభాకర్, సత్యనారాయణ, నాగార్జున్ తదితరులున్నారు.


మాజీ ఎంపీటీసీ రమేశ్‌ను పరామర్శిస్తున్న లోక బాపురెడ్డి, నాయకులు

## ధాన్యం మిల్లులకు తరలించాలి

కొడిమ్యాల, మే 10: మండలంలోని కొడిమ్యాల, చెప్యాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డీఆర్డీవో రఘువరన్ పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం పద్మ, సీసీలు వీరకుమార్, మంగ, సీఏలు మంజుల, జ్యోతి పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కోరుట్ల, మే 10: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బీడీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో అల్లీపూర్ వాసి మృతి

రాయికల్, మే 10: దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి రమేశ్ (42) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ బేకరీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రమేశ్ ప్రయాణిస్తున్న ట్రక్కును మరో ట్రక్కు శనివారం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, రమేశ్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. రమేశ్ మృతదేహం త్వరగా గ్రామానికి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విరాళం అందజేత

కొడిమ్యాల, మే 10: మండలంలోని పూడూర్ గ్రామంలో మార్కండేయ స్వామి ఆలయ ఆవరణంలో భక్తులు సేద తీరడానికి రేకుల షెడ్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన సత్యనారాయణ–అంజలి దంపతులు రూ. లక్ష ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్లకొండ లక్ష్మిపతి, మాజీ సర్పంచ్ వెల్ముల రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జువ్వాడికి నివాళి

మెట్‌పల్లి/జగిత్యాల/కోరుట్ల/మల్లాపూర్, మే 10: మెట్‌పల్లి పట్టణంతో పాటు మల్లాపూర్ మండలంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు వర్ధంతిని శనివారం నిర్వహించారు. జువ్వాడి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, చంద్రశేఖర్‌రావు, జెట్టి లింగం, మహేందర్‌రెడ్డి, లింగారెడ్డి, నర్సాగౌడ్ పాల్గొన్నారు. జగిత్యాలలోని జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పద్మ నాయక సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్ రావు, సాగర్ రావు, సుధాకర్ రావు, ప్రశాంత్‌రావు పాల్గొన్నారు. కోరుట్లలోని జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, శేఖర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నాయకులు అన్నదానం చేశారు.

## క్రీడాకారులకు సత్కారం

మల్యాల, మే 10: శ్రీలంకలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే సెప్టోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులో ఆరుగురు తెలంగాణ క్రీడాకారులుండగా వారిని మల్యాలలోని ప్రతిభ స్కూల్‌లో ఎస్ఐ నరేశ్‌కుమార్ శాలువాలతో సత్కరించారు. తెలంగాణ నుంచి పురుషుల విభాగంలో ఎడవెల్లి అనిల్, వేదవ్యాస్, అక్షయ్‌కుమార్, మహిళల విభాగంలో రాచల హరిణి, హరిణిమూర్తి, టెక్నికల్ అఫీషియల్‌గా సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రావు, అమీర్ పాషా, ఓదెలు యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, మే 10: మండలంలోని లచ్చక్కపేట గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచంధర్ రావు, మాజీ సర్పంచ్ రమణారావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు తదితరులున్నారు.

## రద్దీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

కోరుట్ల, మే 10: పట్టణంలో నిత్యం జనసమ్మర్థంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో శనివారం కోరుట్ల పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల కొత్త బస్టాండ్, ఆర్బీ హోటల్ పరిసరాలు, కిసాన్ షాపింగ్ మాల్, పూజ స్వీట్ హౌస్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీతోపాటు బాటసారుల బ్యాగులను పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాధారణ తనిఖీల్లో భాగంగా ముందస్తు జాగ్రత్త కోసం తనిఖీలు నిర్వహించామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## భార్యపై హత్యాయత్నం

కథలాపూర్, మే 10: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలో అరికొప్పుల పుష్పలతపై హత్యాయత్నం చేసిన భర్త అరికొప్పుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. పుష్పలత, అంజయ్య మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగింది. శనివారం ఉదయం పుష్పలతను గుడిసెలో ఉంచి అంజయ్య నిప్పంటించాడు. ఈ ఘటనలో గుడిసెలోని వస్తువులు కాలిపోయాయి. పుష్పలతకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. పుష్పలత ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

## వీరజవాన్‌కు కొవ్వొత్తులతో నివాళి

కథలాపూర్, మే 10: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో వీరజవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని యువకుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం మురళీనాయక్ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

కోరుట్ల, మే 10: పట్టణంలోని ఎస్సారెస్పీ గడీ ప్రాథమిక పాఠశాలలో వేసవి శిబిరంలో వీరజవాన్ మురళీనాయక్‌కు విద్యార్థులు, అధ్యాపకులు నివాళులర్పించారు. ఇక్కడ హెచ్‌ఎం నునావత్ నాయక్, విద్యార్థులు ఉన్నారు.

## ఓపెన్ జిమ్ పరికరాల చోరీ

రాయికల్, మే 10: పట్టణంలోని ఎస్సారెస్పీ కెనాల్ పక్కన గల ఓపెన్ జిమ్ పరికరాలు చోరీకి గురైనట్లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకోవాలని కోరారు.

## గర్భాశయ క్యాన్సర్ నివారణకు కృషి చేయాలి

జగిత్యాల, మే 10: గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎంఏ జగిత్యాల శాఖ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో ఐఎంఏ జగిత్యాల శాఖ, గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ మాట్లాడుతూ, జగిత్యాలలోని ఐఎంఏ హాల్‌లో ప్రతి నెలా రెండో శనివారం సర్వైకల్ క్యాన్సర్ నివారణ టీకా వేస్తున్నట్లు తెలిపారు. గైనకాలజీ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని కుమార్ మాట్లాడుతూ, 9 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు వ్యాక్సిన్ వేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీలత, ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి సుధీర్‌కుమార్, పద్మ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు గదుల నిర్మాణానికి నిధుల మంజూరు

కథలాపూర్, మే 10: కథలాపూర్ మండలం తాండ్ర్యాల జడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ హైస్కూల్‌లో తరగతి గదుల కొరత ఉందని గ్రామస్తులు విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. స్పందించిన విప్ ఆది శ్రీనివాస్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ. 15 లక్షలు కేటాయించారు.

## మామిడి మార్కెట్‌లో శ్రమ దోపిడీ

జగిత్యాల, మే 10: జగిత్యాల మామిడి మార్కెట్‌లో శ్రమ దోపిడీ జరుగుతున్నదని ఏఐటీయూసీ నేత మహేశ్ పేర్కొన్నారు. మార్కెట్‌లో శనివారం ఆయన కార్మికులను కలిసి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కార్మికులకు కాంట్రాక్టర్లు తమ తోటల్లో మామిడి కాయలు తెంపిన తర్వాత డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టర్లు కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

జగిత్యాల/జగిత్యాల రూరల్, మే 10: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన సనుగుల తిరుపతి ఇటీవల కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసింది. కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాయలంలో బాధిత కుటుంబసభ్యులకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రూ. 50 వేల విలువైన చెక్కుతో పాటు రూ. 4 లక్షల 50 వేల విలువైన బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా సభ్యుడు ముప్పాల రాంచందర్ రావు, ఏడీఈ జవహర్‌నాయక్, నాయకులు వెంకట్రాజం, సాగర్‌రావు, సొల్లు సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, సుషీన్, అంజన్న, అంజిరెడ్డి, టీఆర్‌వీకేఎస్ డివిజన్ అధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు. అలాగే, రాయికల్ పట్టణానికి చెందిన కైరం లత అనారోగ్యంతో బాధపడుతుండగా, చికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్వోసీ మంజూరైంది. కాగా, లత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎల్వోసీ మంజూరు పత్రం అందజేశారు. అలాగే, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను జిల్లా రవాణా శాఖ అధికారి బద్రునాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జగిత్యాల అర్బన్ ఎంఈఓగా నియామకమైన చంద్రకళ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, తదితరులున్నారు.

## గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

రాయికల్, మే 10: మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఎగోలపు రాములు (53) గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాములు ఈనెల 8న ఉదయం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ఛాతిలో నొప్పి రావడంతో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ సూచనల మేరకు కుటుంబసభ్యులు రాయికల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించగా కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## రేపు పాపన్నగౌడ్ విగ్రహాల ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి, మే 10: మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని మల్లాపూర్, చిట్టాపూర్, సాతారం, డబ్బా, మేడిపల్లి క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలను ఈనెల 12న ఆవిష్కరించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాంగౌడ్ తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలో శనివారం పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఐదు చోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి నిజామాబాద్ ఎంపీ అర్వింద్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. గౌడ, గీత కార్మికుల సంఘాల నాయకులు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశంగౌడ్, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, గొల్లపల్లి రామాగౌడ్, రంగు రామాగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మారుతీనగర్, మే 10: మెట్‌పల్లి పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సాంబారి చంద్రశేఖర్ దంపతులు రూ.51,116 పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సంకు ఆనంద్, గుంటుక గౌతమ్, కోశాధికారి భాస్కర్, కార్యదర్శులు సత్యనారాయణ, ప్రసాద్, బాలరాజ్, గణేశ్, హన్మాండ్లు, గుంటుక మహేశ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లాపూర్‌లో పశువైద్య శిబిరం

పెగడపల్లి, మే 10: పెగడపల్లి మండలం ఎల్లాపూర్‌లో శనివారం మండల పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, శంకరయ్య, జానీపాషా, నర్సయ్య, కారోబార్ సత్తయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా 'రాజీవ్ యువ వికాసం' అమలు చేయాలి

కోరుట్ల, మే 10: ఆంక్షలు లేకుండా రాజీవ్ యువవికాసం పథకం అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ నాయకుడు భూపెల్లి నగేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుపేద యువతకు స్వయంఉపాధి పథకాల ద్వారా చేయూతనిచ్చే పథకాలను బీఆర్ఎస్ హయంలో అమలు చేసిన విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులను కుదించడం కోసమే బ్యాంకు సిబిల్ స్కోర్‌పై కొర్రీలు పెడుతుందని ఆరోపించారు. 50శాతం లబ్ధిదారులకు పాన్‌కార్డులు లేవని, గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆంక్షలు లేకుండా రాజీవ్ యువ వికాసం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE



★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189